శ్రీ కాసల నాగభూషణం

# గడ్డిపువ్వు

హాస్పిటల్లో ఆపరేషన్ థియేటర్ పక్కగదిలో కూచున్న కృష్ణమూర్తి తన కెదురుగా వున్న కిటికీలోంచి అవతల లాన్‌లో కనబడుతోన్న క్రోటన్ మొక్కలకేసే చూస్తున్నాడు నిలువు చూపులతో. రాత్రల్లా కురిసిన మంచులో ముద్దగా తడిసిన క్రోటన్లు ఏటవాలుగా పడుతోన్న ఎండలో వింతగా మెరుస్తున్నాయి రంగుటద్దపు పలకల్లా.

తనకీ, క్రోటన్లకీ మధ్య వరండాలో అటూ ఇటూ తిరుగాడుతోన్న చీరకుచ్చెళ్లు, తెల్లగౌన్లు, కాకి నిక్కర్లు, బెల్ బాట మ్‌లు—ఏవీ అతని దృష్టిని ఆకర్షించడంలేదు. నీళ్లతో కలిపి ఆ వుదయం గదులన్నింటినీ శుభ్రంచేసిన ఫినైల్ తాలూకు వాసన పైన తిరుగుతోన్న ఫ్యాన్ గాలికి హాస్పిటల్ మందుల వాసనలతో కలిసి మరింత ఘాటుగా ముక్కుపుటాలకి తగులుతోన్నా అవేవీ అతని గుర్తింపుకి ఆనడంలేదు.

అతని ధ్యాసంతా నీరెండలో తళతళలాడి అంతలోనే మబ్బుల నీడకి వెలవెలపోయిన ఆ క్రోటన్ మొక్కలమీదే- విసురుగాలికి వూగిసలాడి ఎండవేడికి వాడి రాలే వాటి ఆకులమీదే!

''సరిగా ఈ మొక్కల్లాగే అయింది గౌరీ! నీ జీవితంకూడా'' అనుకున్నాడు తనలో కృష్ణమూర్తి.

ఇదిగో! ఈ మాట నేనంటోండగానే మనసులో ఈపాటికే అనుకోవడం—నా అనుమానం నిజమయితే - అతనికీ, గౌరికీ మధ్య ఏదో ప్రేమ బాంధవ్యమే వుంటుందని – అదీ విరివిగా ఈనాడు ఉత్పత్తి అవుతోన్న కథానికల నవలల సాహిత్యంలో దాదాపు ఎనభై శాతం పైగా విస్తరించిన ప్రేమ ప్రభావం ఎంతో కొంత మీమీదా వున్నందువల్ల! అదీగాక ఒక కథలో ఆడా మగా కేరెక్టర్లని పరిచయం చేసేడంటే కథకుడు ఇక వాళ్లు తప్పక హీరో హీరోయిన్లే అయి వుంటారనే నిర్ణయం చేసేసుకుని, ఆ ఇద్దరి ప్రేమకలాపాల కోసమే ఎదురుచూస్తూ వుంటారు పాఠకులు. వాళ్లలో ఆ రకమైన మెంటల్ ప్రిపేర్‌డ్‌నెస్‌ని కలిగించిన కథకులందరికీ ఒక్కసారి కృతజ్ఞతలు తెలుపుకుని నే చెప్పదల్చుకున్న కథనేదో కాస్త విగ్గా చెప్పుకుపోవడమే ప్రస్తుతం నా కర్తవ్యం

ఈ కథలో గౌరి ఊరికే అలా నేలమీద గాలికే ఎగిరిపోయిన పిచ్చిమొక్క అయితే

ఆ పిచ్చిమొక్కని సున్నితంగా వేళ్లతోసహా తవ్వి తీసి భద్రంగా కుండీలో వుంచి పెంచాలనుకున్నవాడు కృష్ణమూర్తి.

ఆ కథా కమామీషేమిటో తెలుసుకోవాలంటే నాతోపాటు మీరూ కృష్ణమూర్తి జీవితంలోకి, ఓ పదేళ్ల గతంలోకి వెళ్లక తప్పదు.

*  *  *

అప్పటికా ఏడే మెడిసన్ పూర్తిచేసి మామగారి సాయంతో వున్న వూళ్లోనే కృష్ణమూర్తి ప్రైవేట్‌గా ప్రాక్టీస్ పెట్టుకున్న తొలిరోజుల్లో

ఒకనాడు —

హాస్పిటల్ ఎక్విప్‌మెంట్‌కోసమై స్నేహితుడు సుధాకర్‌తో కలిసి రైల్లో గుంటూరు వెళుతున్నాడు కృష్ణమూర్తి.

ఆ రైలు బయలుదేరిన సమయానికి గోలగోలగా, గొడవగా చేపల మార్కెట్‌లా వుండిపోయిన వాళ్లెక్కిన కంపార్ట్‌మెంట్ చూస్తోండగానే, వింటోండగానే ఓ వేపునుంచి నిశ్శబ్దం కాసాగింది. సద్దుమణుగుతోన్న కలకలాన్ని వెన్నంటి వేదనాపూరితమైన కంఠస్వరం రాగాలాపనతో వినవచ్చింది. మొత్తం కంపార్ట్‌మెంటే ఆ రాగాన్ని చెవులు రిక్కించి మరీ వినసాగింది.

కంఠంలో పూర్తిగా విషాదాన్ని నింపుకుని, ఆరోహణలో అల్లంతపైకి వెళ్లి అంచెలంచెలుగా కిందిస్థాయికి చేరుకున్న ఆ స్వరం అటు విరమించగానే అందుకు తగ్గవిధంగా గిలకడబ్బా మ్రోత ఒకటి నేపథ్య సంగీతంలా వినిపించింది. ఆపైన అవి రెండూ కష్టమూ, కన్నీళ్లూ కలగలిసినట్లు ఒకదానితో ఒకటి ఏకమై ఆ ప్రయాణీకుల ఏకాగ్రతని ఆకర్షించసాగేయి.

ఆ పాట పాడుతోన్న వ్యక్తి వయసు నలభయికి పైబడే వుంటుంది. మనిషి ఎండిన మ్రోడులా నల్లగా బక్కచిక్కి వుంటాడు. అతనికి కళ్లు రెండూ లేవు. తలవెంట్రుకలు గిరజాలు పెంచేడు. గడ్డం పెరిగింది. చిరిగిన బట్టలు మాసికలు పడ్డాయి. చేతో ఊతగా ఓ కర్రని పట్టుకున్నాడు. పాడుతోన్నంతసేపూ తలని ఆకాశంవేపుగా, ఆవేదనగా ఎత్తి వుంచుకున్నాడు. ఎదురుచూడని ఏదో మాయదారి రోగంతో తన ఇంటికీ, కంటికీ వెలుగైన ఇల్లాల్ని తీసేసుకుని, బ్రతుకుని ఇల్లూ బుగ్గిపాలు చేసేసే వెందుకని చూడలేని తన కళ్లతో ఆ కనిపించని దేవునికి నివేదించుకున్నాడు.

అతని గొంతుకతో గిలకడబ్బా సంగీతాన్ని మేళవించిన ఆ కుర్రవాడు నూరేళ్ల బంగారు భవిష్యత్తునీ ముందుంచుకున్న అతని కొడుకు పదేళ్లవాడు. చిరిగిన నీలం నిక్కరూ, మాసిన తెల్ల

చొక్కా—అది యూనిఫాం కాదు. అసలు చదువుకునే అవకాశమే, అదృష్టమే ఆ పిల్లవానికి లేదు.

పాట ఆగేవరకు గిలకడబ్బాని వాయించేడు వాడు. ఆపైన కళ్లలో ఇంత దైన్యాన్ని నింపుకుని, సహజంగా పిల్లల్లో ఆ వయసుకి వుండవలసిన అభిమానం తెరల్ని చింపుకుని, ఆ గిలక డబ్బానే తిప్పి పట్టుకుని ప్రయాణీకుల్లో ప్రతి ఒక్కరిముందూ నిలవసాగేడు. తనకేసి చూసేవారి గుండెల్లోని దయారసాన్ని "అమ్మా, అయ్యా, బాబూ!" అంటూ కొంత కొంతగా తోడుకోసాగేడు. అల్లాగే వొచ్చి కృష్ణమూర్తి ముందూ ఆగేడు. అంతవరకూ డబ్బాలో పడిన పైసల్ని పైకెగరేసి గలగలలాడించేడు డబ్బాని.

కృష్ణమూర్తి వానివైపోసారి చూసి, జేబులోంచి పది పైసలు తీసి వేసేడు అందులో.

కుర్రాడు డబ్బాని మళ్లీ గలగలలాడించి చూసేడు సుధాకర్ వంక.

సుధాకర్ వానివేపు చూసీ చూడనట్టు చూసి సైగచేసేడు ఎడంచేత్తో వెళ్లిపొమ్మన్నట్టు.

మొహం ఇంతలా చిన్నబుచ్చుకుని అతన్ని చూసి బెదిరినట్టు వెళ్లిపోయేడు వాడు వెనక్కి.

"డర్టీ రోగ్స్! ఇతర్ల దయాదాక్షిణ్యాలని సొమ్ము చేసుకు బతికే వీళ్లంటే అసహ్యం నాకు" అన్నాడు సుధాకర్ తను వాణ్ని చీదరించినందుకుగల కారణాన్ని ఎక్స్‌పోజ్ చేస్తూ.

ఆ మాటని విన్నాడు కృష్ణమూర్తి. తిన్నగా తనలోనే నవ్వుకున్నాడు. బెగ్గింగ్‌పట్ల సరిగ్గా ఇల్లాంటి అభిప్రాయమే వున్న సో కాల్డ్ ఎడ్యుకేటెడ్ జెంటిల్‌మన్ గ్రూప్ కంతటికీ ప్రతినిధిలా కనిపించేడు సుధాకర్ అతని కంటికి.

అందుకనే అతనితో తన మనసులో మాట ఇల్లా చెప్పడం ప్రారంభించేడు "యు వార్ కరెక్ట్ మిస్టర్ సుధాకర్!" అంటూ. "చిన్నతనంనుంచే అభిమానాన్ని చంపుకుని చెయ్యిచాచి యాచించే మనస్తత్వాన్ని అసహ్యించుకోవలసిందే మనం. కాని అదే సమయంలో ఏ పరిస్థితుల్లో వీళ్లిల్లాంటి వృత్తికి అలవాటుపడిపోతున్నారో దాన్ని కొంత ఆలోచించాలిగా!"

ఇక ఇప్పుడు తన ఆర్గ్యుమెంట్‌ని సేఫ్ చేసుకోవలసిన బాధ్యత సుధాకర్ మీదుంది. అతనూ అందుకున్నాడు "వెల్ ఎడ్వయిజ్‌డ్ మూర్తీ! బట్ వన్ థింగ్. నీ సైడ్‌నుంచీ ఈ సమస్యని నేనాలోచించలేదనుకోకు. నువ్వన్నట్టు ఆలోచించడం మొదలెడితే ఊరికి హంతకుడయినా క్షంతవ్యుడే అవుతాడు, పరిస్థితుల దృష్ట్యా. ఓ సైకాలజిస్టే జడ్జి అయితే ఇక జైళ్లే వుండవు ఆ దేశంలో. అఫ్‌కోర్స్ ... కేస్‌ని సైకాలజిస్టుగానే స్టడీచేసినా విధిగా జడ్జిగా మారితీరాలి అతను శిక్షని విధించేప్పుడు. ఫలానా రాజుగారి పరిపాలనలో సుభిక్షంగా వుండేది దేశం అని ఇప్పటికీ మన వాళ్ల అదేదో వాళ్ల గొప్పదనానికి కారణమైనట్టు ప్రగల్భాలు పలికినా ప్రత్యక్షంగా ప్రజల్ని, పరోక్షంగా సొసైటీని ఇబ్బందిలో పెడుతుందీ భిక్షుకవృత్తి. కనక 'ఏదో సింపతీ క్వెశ్చన్. పోనీలే' అనుకుని ఇల్లా మనకి వీలయినంతలో వాళ్లకి కొంత పడెయ్యడంతో మనమూ ఆ వృత్తిలోకే వాళ్లని ఎంకరేజ్ చేస్తున్నాం అని నా అభిప్రాయం. పైగా మారుతోన్న సమాజంలో మనమూ ఈ వృత్తిని మాని స్వశక్తిమీద ఆధారపడదాం అని మాటవరసకయినా అనుకోని వీళ్లపై విపరీతమైన కోపంకూడా."

సుధాకర్ తృప్తిపడ్డాడు తన అభిప్రాయం చెప్పి ముగించి. అయినా కృష్ణమూర్తి మనస్సులోని ఆర్ద్రతని అది సమాధానపరచలేకపోయింది. అతను మరింత సాఫ్ట్ అయ్యేడు "ఎవరో అధికారంలో వున్నవాళ్లు మరిచినా అందరం మరిచిపోలేం సుధాకర్ మనస్సుని. మనం చేసే ప్రతి సాయమూ అవతలివాని ఇనెబిలిటీని ఫుల్‌ఫిల్ చెయ్యడానికే, ప్రోత్సహించడానిక్కాదు. ఫరిన్‌స్టెన్స్— ఇప్పుడొచ్చిన ఈ అబ్బాయినే తీసుకుందాం. వీనికి అన్ని సౌకర్యాలూ కల్పించి, మన పిల్లల్లా వీణ్ని చక్కగా ఎడ్యుకేట్ చేయిస్తే డెఫినెట్‌గా బాగుపడగలడు. అయినా వాణ్ని ప్రస్తుతం వాడున్న పరిధిని దాటి రాకుండా అందులోనే కట్టిపడేసింది వాడి పరిస్థితి. కళ్లు లేని తన తండ్రికి వీడిప్పుడు ఆధారం. వాణ్ని ఆదుకోవడం అటుంచి ఏ కూలినాలి చేసుకునయినా గర్వంగా, ఇంతకంటే హాయిగా బతకొచ్చనే ఊహని వానిలో కలిగించేవాళ్లు లేరు. అందుకే ఒడిలో తననుంచుకుని 'బిడ్డ తల్లిని బాబూ! కనికరించండి' అంటూ తన తల్లి యాచించే అంత చిన్న వయసునుంచీనే వాని నరనరాల్లో జీర్ణించుకుపోతుంది 'బాబూ! ధర్మం చెయ్యండి' అనేమాట. ఇక వానికి చెట్లూ, ఓవర్ బ్రిడ్జిలే ఇళ్లవుతాయి. బస్టాండ్లూ, రైల్వే ప్లాట్‌ఫాంలే వర్కింగ్ స్పాట్స్ అవుతాయి. 'సార్, అమ్మా, బాబూ, అయ్యా'లే వొకాబులరీ అవుతుంది. అలా యాచించడమే వృత్తిగానూ, ఆ నరకమే స్వర్గంగానూ కనబడుతుంది. ఇక ఆ వూబిలోంచి బయటపడగలిగే అవకాశం, అసలల్లాంటి ఆలోచనా వానికి కలగవు. వాడి లోకం వాడిదై, ఈ లోకానికే ఓ సమస్యగా తయారవుతాడు వాడు."

కృష్ణమూర్తి ఆగేడు. ఆ కంపార్ట్‌మెంట్‌లో దాదాపు అందరూ చదువుకున్నవాళ్లే వున్నారు. అందరూ వీళ్లవేపే చూస్తూ వీళ్ల మాటల్నే ఆసక్తిగా వింటున్నారు.

సుధాకర్ అందరినీ ఓమారు పరిశీలనగా చూస్తూ చెప్పసాగేడు కృష్ణమూర్తితో "ఎల్లాగూ మన సంభాషణ ఈ టాపిక్‌మీద వొచ్చింది కాబట్టి నాకు తెలిసిన ఇన్సిడెంట్ ఒకటి చెబుతాను. మా వూళ్లో 'జ్యోతి మహల్' థియేటర్ తెలుసుగా నీకు! అక్కడో అమ్మాయుండేది. రాత్రిళ్లు ఫస్ట్ షో వొదిలింతర్వాతయినా సరే నిలబడ్డ క్యూలవెంట వొచ్చేది అడుక్కుంటూ. అమ్మాయి వయసులో వుంది. కంటికి నదురుగానూ వుంటుంది. ఒంటిమీద చాలీచాలని చిరుగుబట్టలు కాలేజి కుర్రాళ్లు, రిక్షాలాగేవాళ్లు, తాగొచ్చినవాళ్లు, జూదగాళ్లు ఇక

జనం సంగతి ఎల్లా వుంటుందో ఆ పిల్లని చూసేప్పుడు ఆలోచించు—అసహ్యంగా కామెంట్లు, కన్ను గీటడాలు! పాపం, ఆ పిల్ల కాస్త మెంటల్ కండిషన్ తప్పినట్టు కనిపించేది. పట్టించుకునేది కాదు ఇవేవీ. చేతిలోబడ్డ పైసలే పంచప్రాణాలు దానికి. అలా చాలా రోజులుగా వుండేది అక్కడే, ఆ థియేటర్ దగ్గరే.

ఓ రోజు నేను హాస్పిటల్లో డ్యూటీలో వుండగానే పోస్ట్ మార్టమ్‌కి వొచ్చింది ఓ శవం. తీరా చూస్తే ఈ సినిమా పిల్లే. నిర్ఘాంతపోయేను క్షణంసేపు. బట్ట తొలగిస్తే అప్పుడు చూసి వుండాలి ఆ ఘోరం—ఒళ్లంతా పంటి గాట్లు. అప్పుడపుడే ఎదుగుతోన్న పచ్చిప్రాయం. రాక్షసుల్లాంటివాళ్లు — నలుగురైదుగురయి వుండాలి—చెరిచేరు ఆమెని. రక్తపు మడుగులో కొనవూపిరితో కొట్టుకుంటోన్న శరీరాన్ని ఆ రాత్రికి రాత్రే లాక్కొచ్చి పడేసేరు బయట సెంటర్లో. ప్రాణం మరోగంటకి పోయినట్లు తేలింది పరీక్షలో. అమానుషంగా జరిగిన ఈ నేరానికి ఎవరిని శిక్షించాలి? ఎలా సానుభూతి ప్రకటించాలి? ఎంతో ఎదిగిపోయేడు మనిషి అని అనుకోవడమేగాని నిటారుగా నిలబడి మనిషి తనలోకి, తన మనసులోకి తనే చూసుకుంటే ఎన్ని ఘోరాలిల్లాంటివి? ఎన్ని నేరాలు? ఎవరు సాల్వ్ చెయ్యగలరీ సమస్యల్ని? తన బాగుకోసం మనిషి తనే స్వయంగా పాటు పడాలి తప్ప!''

సుధాకర్ చివరికి తన స్టేట్‌మెంట్ దగ్గరి కొచ్చేసేడు. దాని తాలూకు రిఫ్లెక్షన్ ఎల్లా వుంటుందో చూద్దాం అని అందరి మొహాల్లోకీ చూస్తూ తన జేబులోకి పోనిచ్చేడు చేతిని సిగరెట్ కోసం. అయినా వింటారుగాని, చూస్తారుగాని జనం అసలు పట్టించుకుంటారా ఇల్లాంటి వాటిని? ఎవరి మట్టుకివాళ్లు పేపర్లతోనూ, బతాఖీల తోనూ, కబుర్లతోనూ జీవించడం మొదలెట్టేరు.

కాని కృష్ణమూర్తి తన ఆలోచనల లోకంలోకి తను వెళ్లిపోయేడు.

అతను జీవితం తొలిదశలోకి అప్పటి కప్పుడే అడుగుమోపినవాడు. తనలాగే మెడిసన్ చదివి, తనసీ అన్ని విధాలా అర్థం చేసుకుని, తనకీ పూర్తిగా అర్థమయిన అనుపమని అర్ధాంగిగా చేసుకున్నాడు. తమ ఇరువురి అనురాగాన్నీ ఆమెలో పండించుకుని ఇద్దరు బిడ్డలకి తండ్రి అయ్యేడు. జీవించడంలోని పరిపూర్తీ, ప్రేమించడంలోని ఉన్నతీ తెలిసి విలువలపట్ల విశ్వాసాన్ని పెంచుకున్నాడు. ఆలోచనల వేడికీ, ఆదర్శాల ఒత్తిడికీ లోనయి అతనా క్షణంలో ఏదో ఒక బలమైన నిర్ణయాన్నే తీసుకున్నాడు. ఆ నిర్ణయం అతని మొహాన్ని సంతృప్తితో వెలిగించింది.

ఆమారు గుంటూరు వెళ్లేక సుధాకర్‌కి తెలిసిన ఓ సర్జికల్స్‌లో హాస్పిటల్‌కి ఇంకా అదనంగా కావలసిన ఎక్విప్‌మెంట్ ఆర్డర్ చేసేడు కృష్ణమూర్తి. వాళ్ల ఇంట్లోనే ఆ రోజు గడిపి మరునాడు తిరుగుముఖం పట్టేడు ఇంటికి.

అలా వొస్తోన్నపుడు రైల్లో ఖాళీగ వున్న కంపార్ట్‌మెంట్‌లో ఎదుటి సీటువేపుకి కాళ్లు చాపి పత్రికలో తలదూర్చి చదువుకుంటోన్న కృష్ణమూర్తికి వెనకటికి లాగే ''బాబూ ! దరమం'' అంటూ ఓ జాలి గొలిపే పిలుపు వినిపించింది.

ఆ పిలుపుతోటే తలయెత్తి చూసిన అతనికి అందమైన ఓ పాప కనిపించింది. పట్టుమని అయిదారేళ్లయినా వుంటాయో వుండవో ఆ పాపకి.

మళ్లీ అదే అభ్యర్థన ''దరమం బాబూ !''

చామన ఛాయలో కోలగావున్న కనుముక్కు తీరు. పచ్చగా మిసమిసలాడుతూ పందిరిమీదికి పాకి అల్లుకోవలసిన తీగ పాదులోని నీళ్లింకి ఎండకి శోషిల్లినట్టు సరైన పోషణలేక సన్నగిల్లిన ఒళ్లు. మొహంలో కళ వున్నప్పటికీ ఆ సమయానికి చెయ్యి చాపి యాచిస్తోన్నందువల్ల అందుకు తగ్గట్టే కళ్లలోకి దైన్యాన్ని పట్టి తెచ్చుకుంది. ''అయ్యో పాపం !'' అనిపించేలా చూస్తోంది.

ఆ పాపని చూసిన కృష్ణమూర్తికి ఆ క్షణంలో ఆ పాపలో సుధాకర్ వినిపించిన సినిమా పిల్లే కనిపించింది.

''ఈ పిల్లా పెరిగి పెరిగి పెద్దదై ఏదో ఒకనాటి చీకటి రాత్రి ఆ సినిమా పిల్లలాగే మనుషుల్లోని పశుత్వానికి క్రూరంగా బలి కావలసిందేనా?'' ఆక్రోశించేడు కృష్ణమూర్తి మౌనంగా. వెంటనే తనలో స్థిరంగా అనుకున్నాడు ''నో ... అలా కావడానికి వీల్లేదు. ఈ మురికి కూపంలోంచి ఈ పిల్లని నేను తప్పిస్తాను. తప్పక రక్షిస్తాను.''

కృష్ణమూర్తి ఎంతో ఆప్యాయంగా చేరదీసేడు ఆ పిల్లని.

''పాపా ! నీ పేరేంటమ్మా ?'' లాలనగా అడిగేడు.

మొదట కాస్త బెరుగ్గా చూసినా దగ్గరి కొచ్చింది పాప. అతని కేసి చూస్తూ అంది కళ్లనాడిస్తూ ''నా పేరు గవురి.''

ఆ ఉచ్చారణొక్కటే బాధించింది అతన్ని. అయినా అడిగేడు ఆసక్తిగా ''మీ అమ్మా నాన్న ఏరీ? ఎక్కడున్నారు ?''

''నాకు తెల్దు.''

''మరెక్కడుంటున్నావు నువ్వు ?''

''తాత కాడ.''

''ఎక్కడుంటాడా తాత ?''

''ఆడ...రయిలు గేటుకాడ.''

''అన్నం పెట్టేదెవరు నీకు ?''

''తాతే! రొట్టి యిస్తాడు.'' పిల్ల తెలివైందే. చెపుతోంది జవాబులు చక్కగా.

"మరయితే ఈ గౌను చూడు...ఎలా చిరిగిందో! మంచి గౌనొకటి కొనివ్వమనరాదూ మీ తాతయ్యని?" అడిగేడు కృష్ణమూర్తి ఆ పిల్ల గౌనుని పట్టి చూపుతూ.

"అమ్మయ్యోయ్! తాత కొడతడు..."భయం వ్యాపించింది ఆ పిల్ల మొహంలో. మాసిన తన గౌనుకేసి చూసుకుంది దిగాలుగా.

"పోనీ ... నీకు మంచి గౌన్లూ, ఆడుకోడానికి బొమ్మలూ కొనిస్తాను. వొస్తావా నాతో. ఇంకా ఓ తమ్ముడూ, చెల్లాయీ వున్నారు మా ఇంట్లో."

ఏమని అనుకుందో ఏమో మనసులో, ఆపిల్ల వొస్తానన్నట్టు తల వూపింది. అదే తడవుగ కృష్ణమూర్తి ఆదర్శాల శిఖరారోహణలో తను మొదటి మెట్టెక్కినట్టు సంబరపడ్డాడు.

ఊళ్లో దిగి ఆ పిల్లని వెంటబెట్టుకుని వెళ్లేడు ఇంటికి.

"ఎవర్నాయనా! ఈ పిల్ల?" వాకిట్లోనే ఎదురై అడిగింది వాళ్ల అత్తయ్య అతన్ని.

"చిన్నప్పుడు నాతో కలిసి చదువుకున్న ఓ స్నేహితుని కూతురు. పాపం, చాలా పేదవాళ్లు. ట్రెయిన్‌లో కలిసేరు. మధ్య స్టేషన్‌లో టిఫిన్‌కోసం దిగేడు అతను. తీరా ట్రెయిన్ కదిలేలోగా అందుకోలేకపోయేడు. ఇక చేసేదిలేక తీసుకొచ్చేను నేనీ పిల్లని." బుకాయించేడు కృష్ణమూర్తి నిజం చెప్పి ఆవిణ్ని ఒప్పించలేక.

అల్లుని కెదురుగా అంతకుమించి మరేంమాట్లాడలేని ఆవిడ కల్పించుకో లేదు, ఆ విషయంలో అంతకంటె ఎక్కువగా.

కృష్ణమూర్తి పనిమనిషిచేత ఆ పిల్లకి స్నానం చేయించి, అప్పటికప్పుడు బజారెళ్లి రెడీమేడ్ ఫ్రాకులు కొని తగిలించేడు. ఆ లోపున కాన్వెంట్‌నించి తిరిగొచ్చిన అయిదేళ్ల కూతురు రూపకి గౌరిని చూపి

"ఇదిగోమ్మా! రూపా! మీకో కొత్త ఫ్రెండ్ వొచ్చింది.. కూడా ఆడుకోడానికి" అంటూ ఆ ఇద్దరినీ జత కలిపేడు.

ఊయెల్లో నిద్దరోతోన్న రెండేళ్ల బాబుని గౌరికి చూపి

"మీ ఇద్దరికీ తమ్ముడు. బావున్నాడు కదూ బాబు!" అంటూ మురిపించేడు.

ఊయెలపైన తిన్నగా గాలికి తిరుగుతూ మ్రోగుతోన్న మ్యూజికల్ బెల్స్‌ని చూసి "అయ్యోయ్! బాగుండది గెంట" అని ఎగిరి గంతేసిన గౌరిని

"తప్పమ్మా! అల్లా అనకూడదు" అంటూ వారించి, ఆ మాటే రూపచేత పలికించి అనుకరింపజేసేడు.

"ఇక మీరాడుకోండి" అని వాళ్లిద్దర్నీ మేడమీద వొదిలి, జాగ్రత్తగా చూసుకొమ్మని పనిమనిషిని హెచ్చరించేడు. తను స్నానం చేసి, బట్టలు మార్చుకుని అత్తయ్యతో చెప్పి వెళ్లేడు హాస్పిటల్‌కి.

అక్కడ తను లోపలికి ఎంటర్ కావడం చూసి వార్డుల వెంట చెకింగ్‌కి వెళ్లబోతున్నదల్లా ఆగి

"ఆలస్యం చేసేరే" అంటూ సమీపించిన అనుపమని

"నీతో ఓ మాట అనుపమా! ఇటు రా, మాట్లాడుకుందాం" అని తన కన్సల్టింగ్ రూంలోకి తీసికెళ్లేడు.

ఎదురుగా కుర్చీలో కూచుని, స్టెత్‌ని తీసి బల్లమీద వుంచుతూ 'ఆఁ ... ఇక చెప్పండి" అన్నట్టు చిలిపిగా చూసిన అనుపమతో చెప్పేడు గౌరిని గురించి, తను ఆ పిల్లని తమ ఇంటికి తీసుకురావడం గురించి.

ఆఖరున "నీతో చెప్పకనే నే చేసిన మొట్టమొదటి పని ఇదీ అనుపమా! ఏమంటావ్?" అని అభ్యర్థనగా చూసేడు ఆమె కళ్లలోకి.

అనుపమ నవ్వుతూ అంగీకరించింది అతని అభ్యర్థనని. దానితో ఆదర్శం ప్రతిపాదనని ఆచరణ ఆమోదించినట్టయింది. ఫలితంగా ఓ పిచ్చిమొక్క పూలకుండీని చేరుకుంది.

అయితే కృష్ణమూర్తి ఆశయం అంతటితో నెరవేరలేదు.

ఒక ఆశయం సఫలం కావడానికి ఎన్నివిధాల సహకారం వుండాలో అనుభవ పూర్వకంగా తెలిసివొచ్చింది కృష్ణమూర్తికి.

అలా గౌరి తమ ఇంటిని చేరుకున్న ఓ నెలన్నరకి —

బాబుకి మూడోఏడు వొచ్చింది.

ఆ రోజున పుట్టినరోజు పండుగ జరుపుకుంటూ బంధుమిత్రుల్ని ఆహ్వానించేరు కృష్ణమూర్తి దంపతులు. అందరూ ఏవేవో ప్రెజెంటేషన్స్ ఇచ్చేరు.

అల్లుడూ కూతుళ్ళ ఫోటోలని లోపలవుంచి చేయించిన లాకెట్‌ని బాబు మెళ్ళో వేసింది వాళ్ళ అమ్మమ్మ.

"అబ్బో! గొప్ప బహుమానమే ఇచ్చేరు మీరు మనవడికి" అంటూ అందరూ పొగిడేరు ఆమెని.

బంధుమిత్రుల కులాసా కబుర్లతో, కాలక్షేపాలతో కొత్తగా పెట్టిన హాస్పిటల్ పరామర్శలతో సందడిగా వుంది ఇల్లు.

ఆ సాయంత్రం ఇంటిముందటి లాన్‌లో గౌరితో, ఇంకా కొంతమంది ఇరుగుపొరుగు పిల్లలతో కలిసి బాబుని తెచ్చుకుని ఆడుకుంటోంది రూప. బాబుని మధ్యలో ఓచోట వొదిలి ఆటపాటలతో, కేరింతలతో, గిల్లికజ్జాలతో కాసేపు వెళ్లబుచ్చి బాబునెత్తుకుని వెళ్లింది లోపలికి.

వాణ్ని చేతుల్లోకి తీసుకుంటూ

"బాబు మెళ్లో లాకెట్ నీవుగాని తీసివుంచేవా అనుపమా?" అని కూతుర్ని అడిగింది వాని అమ్మమ్మ.

"లేదమ్మా! నేనెందుకు తీస్తానూ ?" అని పైనించి పలికింది అనుపమ.

అలా "నువ్వు తీసేవా ?" అంటే "నువ్వు తీసేవా ?" అంటూ అందరూ అడగసాగేరు అందరినీ. చివరగా వెదుక్కున్నారు గౌరిని "అవును ఇంతకీ గౌరేదీ ?" అని·

"అయ్యబాబోయ్! ఆ పాపిష్టిపిల్లే చేసిందర్రా ఇంతపనీ. అబ్బాయేదో నాతో అప్పటికప్పుడు అల్లా బుకాయించి చెప్పినా ఆ వొచ్చినినాటినుంచీ అనుమానమే నాకు దానిమీద. పోనీలే అనుకున్నాగాని ముష్టిముండ! చివరికింతకు తెగిస్తుందనుకోలేదు మొర్రో" అని నెత్తీ నోరూ మొత్తుకుంది మెత్తగా.

అన్నట్టే గౌరీ కనిపించలేదు వాళ్లకి ఆ రోజుట్నుంచి.

లాకెట్ పోవడాన్నీ, గౌరి కనిపించకపోవడాన్నీ ఒకటిగా చేర్చి ఆ అనుమానాన్నే బలపరుచుకున్నారందరూ.

"నువ్వూ నమ్ముతున్నావా అనుపమా! ఈ విషయాన్ని?" అని తను అడిగితే అందుకు బదులేం చెప్పక ఆమెకూడా మౌనంగా వుండిపోతే ఇక ఆ ముద్దాయికి మద్దతు నిచ్చినవాడిలా తల వొంచక తప్పలేదు కృష్ణమూర్తికి.

కాని ఆ లాకెట్‌ని పక్కింటి ప్లీడర్‌గారి అబ్బాయే తీసేడనీ, తీసి వాళ్లమ్మ చేతి కిచ్చేడనీ, అది గుట్టుచప్పుడు కాకుండా వాళ్లమ్మగారి వూరికి దాటిపోయిందనీ, తల్లి కడుపులోంచి బయటపడ్డ దగ్గర్నుంచీ తనకే మాత్రం పరిచయంలేని ఈ అప్పర్‌క్లాస్ సొసైటీతో ఎడ్జెస్ట్ కాలేకే దానికి భయపడి గౌరి దూరంగా పారిపోయిందనీ నిజం తెలిసిరాలేదు ఎవ్వరికీ.

అప్పుడనగా అలా నలుగురూ అంటగట్టిన దొంగతనాన్ని మోసుకెళ్లిన గౌరిని ఇన్నేళ్లకి తర్వాత ఇప్పుడు ఇలా నలుగురు మనుషులు స్పృహని కోల్పోయిన స్థితిలో మోసుకు రాగలరని ఏనాడూ వూహించలేదు కృష్ణమూర్తి. ఎక్కడెక్కడ తిరిగిందో, ఎలా ఎలా పెరిగిందో అంత పచ్చిప్రాయంలో విడిగీ విడగని వయసున చీకటి కౌగిట్లో, ఏ పశుత్వం గుప్పిట్లో నలిగిందో, ఫలితంగా తన కడుపున ఏ మాంసపు ముద్దని ప్రాణంపోసి పెంచిందో ఈనాడు తనలో పెరిగిన ఆ ప్రాణికోసం తన ప్రాణం విలవిల్లాడుతోండగా కళ్లు విప్పి తననీ, లోకాన్నీ చూడలేని స్థితిలో వొచ్చింది తన దగ్గరికి.

"అడుక్కునేది బాబయ్యా! పాపం పిచ్చిది. నీళ్లోసుకున్న కాణ్ణించి మాకాడే వుంది. పసిపిల్ల. కాన్పుకష్టమైతే తీసుకొచ్చేం. మీరే దిక్కు. తల్లినీ, పిల్లనీ ఏరుసేసి పున్నెం కట్టుకోండి." వెళ్లికిలా తిరగేసిన మంచంమీద గౌరిని తన ముందుంచి పల్లె మనుషులు మొరెట్టుకుంటే ఆశ్చర్యంతోపాటు అంతటి దుఃఖాన్నీ తనలో తానే దాచుకున్నాడు కృష్ణమూర్తి.

వెంటనే ఆపరేషన్‌కి అన్ని ఏర్పాట్లూ చేయించి, అనుపమని పిల్చి

"చూసేవా అనుపమా! ఇదీ విధి అంటే – ఏవో అదృశ్య శక్తుల నిర్ణయం కాదు – మన జీవితంలోనే పూర్వాపరాల జరిగే సంఘటనల సారూప్యం, ఛాన్స్! తనమీద నీకు సదభిప్రాయం లేకున్నా చివరికి నీ దగ్గరికే చేరింది గౌరి, ప్రాణభిక్ష కోసం. కొన్ని రోజులే అయినా నీ చేతి అన్నం తిన్న ప్రాణి. ఎలా చేస్తావో" అంటూ ఆమెకి అప్పగించేడు కేస్‌ని.

"మీ భార్యనే నండీ నేను! ఆ మాత్రం నమ్మకం వుంచండి చాలు నా మీద" అన్నట్టు భర్తవేపు క్షణం చూసి చేతులకి గ్లవుజెస్ తొడుక్కుంటూ ఆపరేషన్ థియేటర్‌లోకి యోగినిలా నడిచివెళ్లింది అనుపమ.

*     *     *

కాసేపటికి పురిటికేక వినిపించింది లోపల్నుంచి.

సంభ్రమంతో, సంతోషంతో లేచి గది వెలుపలికి నడుస్తోన్న కృష్ణమూర్తికి ఎదురైంది నర్స్.

"మగపిల్లాడు" అంతే అంది.

ఆపైన వినిపించుకోక ఆ వూపున్నే వెళ్లేడు కృష్ణమూర్తి లోపలికి. టేబుల్‌పైని చూసేడు.

ఒళ్లంతా నెత్తురు మరకలతో ముద్ద గట్టుకుపోయిన పసిగుడ్డుపక్కన వూర్తిగా తెల్లబట్ట ముసుగుకప్పిన ఆకారం. అది శవం!

చిన్నబుచ్చుకున్న మొహంతో తనకి చేరువగా వొచ్చి అంది అనుపమ అతనితో సంజాయిషీ ఇస్తోన్నట్టు "నా సాయశక్తులా ప్రయత్నించేనండీ! దురదృష్టవంతురాల్ని ... గౌరిని దక్కించుకోలేకపోయేను." వృత్తిధర్మంతో అంతసేపూ మాటుమణిగి వుండిపోయిన బేలతనం ఒక్కమారుగా ఆవరించింది అనుపమని.

"బాధపడకు అనుపమా! ఇంత సీరియస్ అయిన కేస్‌లోనూ ఈ ఒక్క ప్రాణాన్నయినా నిలపగలిగేవు, నీ సామర్థ్యంతో నేగా!" ఓదార్చేడు కృష్ణమూర్తి భార్యని.

"లోకం తెలియని ఈ నిసుగందుని అనాథని చెయ్యడం ఎందుకండీ! మనమే పెంచుకుందాం. మనకిక ఇద్దరుకాదు – ముగ్గురు పిల్లలు." అనుపమ వేడికోలుగా అంది అతని భుజంమీద వాలి.

ఆప్యాయంగా ఆమె చేతిని అందుకుంటూ అన్నాడు కృష్ణమూర్తి "నాలో నేననుకున్నది నువ్వు మాటల్లో పలుకుతావు అనుపమా! నేనెంత అదృష్టవంతుణ్ణి!"

"కాదు ... ఆ అదృష్టవంతుణ్ణి నేను" అన్నట్టు వేళ్ళని బిగించి, మొగ్గల్లా ముడుచుకున్న అరచేతుల్ని చాచి కెవ్వున అరిచేడు వాడు – ఆ అభాగ్యపు శిశువు – అప్పుడే విరిసిన గడ్డిపువ్వు!"